శివుడికి ప్రత్యేక పూజలు



ఇందిరానగర్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రాయదుర్గం: మాస శివరాత్రిని పురస్కరించుకొని శివాలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. శనివారం ఇందిరానగర్‌లోని ఇంటర్నేషనల్ హనుమాన్‌ధామ్ ఆశ్రమమ్ ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు, భక్తులతో ప్రత్యేక అభిషేకాలు చేయించిన అనంతరం ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో కాశీవిశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా శివుడికి అర్చనలు, జలాభిషేకం నిర్వహించారు. అనంతరం రుద్రాక్షలతో ప్రత్యేక అలంకారం చేసిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు.

త్వరలో సమస్యలను పరిష్కరిస్తా

బస్తీ దర్శన్‌లో కార్పొరేటర్ పుష్ప



మ్యాన్‌హోల్స్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్ కాలనీలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో బస్తీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా మార్నింగ్ వాక్ విత్ అఫీషియల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, ఉప కమిషనర్ సురేశ్, ఏఎంఓహెచ్ విజయమోహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కార్పొరేటర్ పుష్ప మాట్లాడుతూ త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగించడం దారుణం

పటాన్‌చెరు టౌన్: వరంగల్ సభ కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడం దారుణమని బీఆర్‌ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఫ్లెక్సీలను శుక్రవారం రాత్రి జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ సిబ్బంది తొలగించడం అప్రజాస్వామికమన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ కుమార్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, యువ నాయకులు చిన్న, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

30న లబ్ధిదారుల ఎంపిక

జిన్నారం (పటాన్‌చెరు): రాజీవ్ యువ వికాసం 2024- 25 పథకానికి దరఖాస్తు చేసుకున్న యువకులకు ఈనెల 30వ తేదీన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు మండల అభివృద్ధి అధికారి అరుణ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు బ్యాంకు మేనేజర్లు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

గ్రాడ్యుయేషన్ వేడుకలు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మ బస్తి, చర్చి బస్తీల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షరాభ్యాసం పూర్తి చేసి ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీరాబాయి, అంగన్వాడీ టీచర్లు ప్రసన్న, భూలక్ష్మి, ఆయాలు పాల్గొన్నారు.

ఆహార భద్రత, రైతుల ఆదాయ వృద్ధిపై దృష్టి సారించాలి

నార్మ్స్‌లో ఘనంగా పీజీడీఎం, ఏబీఎం స్నాతకోత్సవం

ఏజీవర్సిటీ: జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థ (నార్మ్స్)లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్మెంట్ (పీజీడీఎ) అగ్రి బిజినెస్ (ఎబీఎం) 5వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా (పద్మభూషణ్ అవార్డు గ్రహీత) ఐసీఏఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్.ఎస్.పరోడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి కీలక ఉపన్యాసం చేశారు. యువత కేవలం ఉద్యోగ అవకాశాల పైనే దృష్టి పెట్టకుండా ఆహార భద్రత, గ్రామీణ రైతుల ఆదాయం పెంచడం, పర్యావరణ స్థిరత్వంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా 2021, 2022, 2023వ బ్యాచ్‌లకు చెందిన 176 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు.

శేరిలింగంపల్లి సమగ్రాభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి/రాయదుర్గం/చందానగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గం సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో రూ.8.06 కోట్ల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్లు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాలనీలు, బస్తీల్లో అన్ని అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చే ప్రక్రియను అయిదేళ్లుగా పని చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో అన్ని అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మారుస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మార్గ దర్శకత్వంలో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిస్తామన్నారు. డ్రైనేజీ సమస్యలకు కూడా శాశ్వత పరిష్కారం చూపుతామని, అందుకోసం తగిన ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటామని, ఎలాంటి చిన్న పని అయినా వెంటనే సంప్రదించాలని ఆయన కోరారు. కాలనీలు, బస్తీల్లో తరచూ పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామని, వారు కోరిన విధంగా పనులను చేపట్టేందుకు తగిన ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు హమీద్‌పటేల్, గంగాధర్‌రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్, జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీ, బస్తీ వాసులు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లిలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు



గచ్చిబౌలిలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

నయనానందకరంగా నాట్య నీరాజనం

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని అర్ధనారీశ్వరస్వామి ఆలయంలో రమాదేవి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు చేసిన నాట్య నీరాజనం కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను సమ్మోహనపరిచాయి. నిజాంపేటలోని ఈ అకాడమీ 20వ వార్షికోత్సవం సందర్భంగా నాట్య నీరాజనం కార్యక్రమం నిర్వాహించారు. ఇందులో చిన్నారి బన్వీ బృందం చేసిన కూచిపూడి నృత్యం అబ్బురపరిచింది. కూచిపూడి నృత్యంలోని క్లిష్టతరమైన వివిధ భంగిమలను కూడా చిన్నారులు అలవోకగా వేదికపైన ప్రదర్శించి మన్ననలను పొందారు. తొలుత ఈ నాట్య నీరాజనం కార్యక్రమం ప్రథమ గణాధిపతి వినాయకుడిని ప్రార్థిస్తూ చేసిన గణేష్ కౌస్తుభం ప్రార్థనతో ఆరంభమైంది. అనంతరం కూచిపూడి విద్యార్థులు అభినయించిన బ్రహ్మాంజలి, శివోహంచ ఆనంద తాండవం నృత్యాలు నయనానందకరంగా సాగాయి ఓం నమశివాయ అంటూ నటరాజును సేవిస్తూ కూచిపూడి విద్యార్థులు, చిన్నారులు తన్మయంతో చేసిన నృత్యాలు భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. దీంతో పాటు అదివో అల్లదివో, అలరులు కురియగ లాంటి అన్నమాచార్య కీర్తలను కూడా భక్తులను అలవరిచాయి. అనంతరం ఆలయ అధికారులు రమాదేవి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు డాక్టర్ ఏ రమాదేవి, కూచిపూడి నృత్య కళాకారిణులను సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు.



చిన్నారి బన్వీ నృత్య ప్రదర్శన

ఘనంగా వాజ్‌పేయి శత జయంత్యుత్సవాలు



ఉత్సవాలను ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ తదితరులు

చందానగర్: అటల్ బిహార్ వాజ్‌పేయి దేశ ప్రజలందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ పేర్కొన్నారు. శనివారం మియాపూర్ ఆల్విన్ కాలనీ శ్రీయ బ్యాంక్వై ట్ హాల్‌లో మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జన్మించిన వాజ్‌పేయి భారతీయ జనతా పార్టీ అభివృద్ధికి తన చిన్నతనం నుంచి పాటుపడుతూ అంచలంచలుగా ఎదుగుతూ దేశ ప్రధానిగా ఎదిగారన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కేశవరావు, రామరాజు, మణిభూషణ్, అశోక్, వసంత్ యాదవ్, రమణయ్య, రాధాకృష్ణ యాదవ్, నరసింహ చారి, వినయ, పద్మ, మహేష్ యాదవ్, జితేందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల భవనం ఏర్పాటు చేయాలి

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో దివ్యాంగుల భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ శేరిలింగంపల్లి దివ్యాంగుల పట్టణ సమాఖ్య అధ్యక్షుడు మేకల అశోక్‌కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సభ్యులు తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ డైరెక్టర్ శైలజకు శనివారం వినతిపత్రం అందజేశారు. నియోజవకర్గంలో దివ్యాంగులకు ఎలాంటి భవనం లేదని, దాదాపు 3 నుంచి 4వేల మంది వివిధ రకాల దివ్యాంగులం ఉన్నమని గుర్తుచేశారు. ప్రతినెలా సమాఖ్య సమావేశాలు నిర్వహిస్తున్నామని కానీ సౌకర్యాలు లేక నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దివ్యాంగులకు ఒక భవనం నిర్మాణం చేస్తే అందరికీ మేలు చేకూరినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌వీఎస్ అధ్యక్షుడు మున్నాభాయ్, శ్రీనివాసులు, నాగభూషణం పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న దివ్యాగుల సమాఖ్య సభ్యులు

హోటల్‌లో గ్యాస్ లీకై మంటలు

ఇద్దరికి గాయాలు

గచ్చిబౌలి: హోటల్‌లో గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో ఇద్దరికి గాయాలైన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..గచ్చిబౌలిలోని టీఎన్‌జీవోస్ కాలనీలో కిరణ్ అనే వ్యక్తి హంగ్రీ ఇడ్లీ పేరిట హోటల్ నిర్వహిస్తున్నారు. హోటల్‌లో పని చేసే వంటమనుషులు రాజీవ్(35), శంకర్(23) శనివారం ఉదయం 6.30 గంటల సమయంలో హోటల్‌కు వచ్చారు. స్టవ్ వెలిగించగా ఒక్కసారిగా మంటలు చెలరేగి గాయాల బారినపడ్డారు. గ్యాస్ లీక్ కావడం గుర్తించకుండా లైటర్‌తో స్టవ్ వెలిగించగా ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో అక్కడే ఉన్న రాజీవ్‌కు 30 శాతం, శంకర్‌కు 39 శాతం పొట్ట, కాళ్లు, చేతులకు కాలిన గాయాలతో గాంధీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కంచెను తొలగించిన వారిపై కేసు

మియాపూర్: మియాపూర్‌లోని సర్వేనంబర్ 100, 101 భూమిలో ఏర్పాటు చేసిన కంచె తొలగించి ఆక్రమణలకు యత్నించిన ఇద్దరు వ్యక్తులపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్, హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..మియాపూర్‌లోని 100, 101లో సుమారు 551 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి గత దశాబ్దాల కారణంగా కోర్టులో వివాదం కొనసాగుతుంది. 2003లో ఈ భూమి ప్రభుత్వ భూమి అని హైకోర్టు తీర్పు ఇవ్వగా కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఈ భూములు మావేనని సుప్రీంకోర్టులో దావా వేశారు. ప్రస్తుతం ఈ భూమిపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతుంది. గత కొన్ని రోజుల క్రిందట ఈ భూమి కబ్జాచేసేందుకు యత్నిస్తుండగా హెచ్‌ఎండీఏ అధికారులు 100, 101 సర్వేనంబర్ భూమి చుట్టు కంచె ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు మియాపూర్ ఎంఏనగర్ కాలనీ సమీపంలో జేసీబీ సాయంతో కంచెను తొలగించి భూమిని ఆక్రమించే ప్రయత్నం చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న హుడా సిబ్బంది గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అధికారులు అక్కడికి చేరుకుని పరిశీలించి కంచె తొలగించి ఆక్రమణకు పాల్పడుతున్న వెంకటేశ్వర్‌రావు, జేసీబీ డ్రైవర్ దత్తు, మరికొంత మందిపై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు వెంకటేశ్వర్ రావు, జేసీబీ డ్రైవర్ దత్తు, మరికొంత మందిపై కేసు నమోదు చేసి, జేసీబీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



జేసీబీతో కంచెను తొలగిస్తున్న దృశ్యం

క్రీడాకారులకు హోప్ ఫౌండేషన్ ప్రోత్సాహం



నగదు ప్రోత్సహకం అందజేస్తున్న దృశ్యం

చందానగర్: రెజ్లింగ్, బాక్సింగ్‌లలో రాణిస్తున్న అక్క తమ్ముళ్లకు హోప్ ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ ఒలింపిక్ సంయుక్త కార్యదర్శి కొండ విజయ్‌కుమార్ క్రీడా కిట్ల కొనుగోలు కోసం నగదు ప్రోత్సాహకం అందజేశారు. శనివారం చందానగర్ హుడాకాలనీలోని హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎంబజీకి చెందిన సుంకు కావ్య రెజ్లింగ్‌లో, సుంకు హర్షవర్ధన్ బాక్సింగ్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి పలు పతకాలు సాధించారన్నారు. రానున్న రోజుల్లో జరిగే టోర్నమెంట్‌లో రాణించాలని దాని కోసం ఆధునిక కిట్ల కొనుగోలుకు నగదును అందజేయడం జరిగిందన్నారు.

గురుకులంలో వేసవి శిబిరం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో వేసవి శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మే 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వెంకట్ నారాయణ తెలిపారు. శనివారం స్థానిక విద్యార్థులకు బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలోని గురుకులాలకు అనాథ విద్యార్థులను గుర్తించి చిత్రలేఖనం, వివిధ రకాల అంశాలపై నైపుణ్యం పెంపొందించనున్నట్లు తెలిపారు.

అన్నదానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శ్రీగురు విశ్వస్ఫూర్తి పుట్టిన రోజు సందర్భంగా శనివారం రామచంద్రాపురం లింగంపల్లి చౌరస్తాలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన భక్తులు మాట్లాడుతూ తమ గురువు పుట్టిన రోజు సందర్భంగా పలు చోట్ల అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే విధంగా నగరంలో 15చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీలిమ, మాణిక్ రెడ్డి , శ్రీహరి కిషన్ రెడ్డి, వెంకట నాయుడు, వివేక్, చరిత్, నాగభూషణం పాల్గొన్నారు.

ఊపిరాడక ఉక్కిరి బిక్కిరి



విష వాయువులతో కమ్ముకుపోయిన పారిశ్రామికవాడ

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో పలు పరిశ్రమలు వాతావరణంలోకి విష వాయువులను విడుదల చేశారు. దీంతో పారిశ్రామిక వాడ ప్రజలు ఉక్కిరి బిక్కిరయ్యారు. విషవాయువులు లీఫార్మా పరిశ్రమ నుంచి విడుదలైనట్లు స్థానికులు గుర్తించారు. నిత్యం ఉదయం సాయంకాల వేళలో పరిశ్రమ గొట్టాల నుంచి విషవాయువులను విడుదల చేస్తున్నారని వీటిని పీల్చడంతో చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్య పాలవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. పీసీబీ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి కాలుష్యాన్ని విడుదల చేస్తున్న పరిశ్రమలపై ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

త్వరలో అందుబాటులోకి వివిధ కోర్సులు

గచ్చిబౌలి: యూకేలోని అగ్రశ్రేణి రసెల్స్ గ్రూపు విశ్వవిద్యాలయాల్లో ఒకటైన సౌతాంప్టన్ ఢిల్లీ యూనివర్సిటీలో త్వరలో వివిధ రకాల కోర్సులు అందుబాటులో ఉంటాయని సౌతాంప్టన్ ఢిల్లీ యూనివర్సిటీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ విశాల్ తల్వార్ తెలిపారు. శనివారం గచ్చిబౌలిలోని లీ మెరీడియన్ హోటల్‌లో యూనివర్సిటీ ఆఫ్ సౌతాంప్టన్ అకడమిక్ డిస్కవరీ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ..గుర్‌గావ్ కేంద్రంగా పని చేస్తున్న సౌతాంప్టన్ ఢిల్లీ యూనివర్సిటీలో ఆగస్టు-2025లో కోర్సులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. యూకే తరహా ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో బీఎస్సీ అకౌంటింగ్, ఫైనాన్స్, బీఎస్సీ ఎకనామిక్స్, బీఎస్సీ బిజినెస్ మేనేజ్‌మెంట్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంఎస్సీ ఇంటర్నేషనల్ మేనేజ్‌మెంట్, ఎంఎస్సీ ఫైనాన్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్స్ ఉంటాయని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా క్యూస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్‌లో టాప్ 100, గ్రాడ్యుయేట్ ఉపాధిలో టాప్ 125లో నిలిచిందన్నారు. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంల కోసం ఢిల్లీ ప్రెసిడెన్షియల్ స్కాలర్‌షిప్‌లు, ఫ్యూచర్ టాలెంట్ స్కాలర్‌షిప్‌లను ప్రవేశపెట్టామని వివరించారు. దరఖాస్తుల కోసం ఎర్లీబర్డ్ డెడ్‌లైన్‌గా ఏప్రిల్ 28గా నిర్ణయించామన్నారు.



కోర్సుల వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ విశాల్ తల్వార్

ఆకట్టుకున్న నృత్య సమ్మేళనం



మాదాపూర్: కళాకారులు నృత్య సమ్మేళనంతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం కందుల కూచిపూడి నాట్యాలయం గురువు రవి కూచిపూడి నృత్య సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. కథక్, భరతనాట్యం, మణిపురి, పేరిణి, ఒడిసి నృత్య ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. మోహన్‌రెడ్డి కథక్ నృత్యంలో శివధ్రుపద్, తరణ అంశాలను, సుగమ్య భరతనాట్యంలో బంటురీతి, ముద్దుగారే యశోధ, నందిచాలా అంశాలను, ఎస్‌కె బాద్షా మణిపురిలో దశావతారంను, సాయికుమార్, సాయిసంతోష్ పేరిణి శివతాండవంలో మేశాప్రాప్తి, ఆకాశసమీకరణం, శ్రీరామ కౌండిన్య, కూచిపూడి నందకనందగోపాల, సత్యప్రకాశ్ ఒడిసిలో సూర్యాష్టకం, రవి శిష్యబృందంచే కూచిపూడిలో మహాగణపతిం, నమఃశివాయ తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. అనంతరం కళాకారులను రవి ఘనంగా సత్కరించారు.



కళాకారుల నృత్యాలు

భూముల కబ్జాపై కలెక్టర్‌కు వినతులు

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని నందిగామ గ్రామంలో నిషేధిత జాబితాలో ఉన్న సుమారు 5 ఎకరాల అసైన్డ్ భూమిని 2020లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత కుటుంబానికి చెందిన వారు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆరోపించారు. శనివారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన భూభారతి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. విచారణ జరిపించి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరారు. రుద్రారంలో ఉన్న పెద్ద చెరువు అలుగులను, ఆయకట్టుకు వెళ్లే కాలువలను బాలాజీ బిల్డర్స్ యాజమాన్యం ఆక్రమించిందని సీపీఎం పార్టీ పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు ఆరోపించారు. ఈ మేరకు వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

రైతులను పట్టించుకోవడం లేదు

రామచంద్రాపురం(పటాన్ చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు పశువైద్యాధికారిని రైతులను పట్టించుకోవడం లేదని తెల్లాపూర్ పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి పట్టణంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ వల్లూరి క్రాంతికి ఫిర్యాదు చేశారు. లక్షల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన గేదెలకు సరైన వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరసనల వెల్లువ



శాంతి ర్యాలీలో టీఎన్‌జీఓ కాలనీవాసులు

వాడవాడల కొవ్వొత్తుల ర్యాలీలు

గచ్చిబౌలి: ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలవాలని కొండాపూర్ డివిజన్‌లోని సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు సూచించారు. శనివారం ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు. ఈ ఘటనను నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

తారానగర్‌లో..

చందానగర్: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ శనివారం తారానగర్‌లోని ప్రధాన రోడ్డులో వ్యాపారాల సముదాయాల వ్యాపారస్తులు, స్థానికులు కలిసి కొవ్వొత్తుల నిరసన ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రదాడికి నిరసన నినాదాలు చేశారు. మారణహోమానికి కారకులైన వారందరిని ప్రధాని నరేంద్ర మోదీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

టీఎన్‌జీఓకాలనీలో శాంతి ర్యాలీ

రాయదుర్గం: పహల్గాంలో ఉగ్రవాదుల దాడులకు బలైన భారతీయులను స్మరిస్తూ గచ్చిబౌలి డివిజన్‌లోని టీఎన్‌జీఓకాలనీలో శాంతి ర్యాలీ నిర్వహించారు. శనివారం రాత్రి కాలనీవాసులు కాలనీలోని రోడ్లపై కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మృతులకు ఘనంగా నివాళులర్పించారు.

రాయదుర్గంలో..

టెర్రరిజమ్ నశించాలని నినదిస్తూ గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గంలోని వెస్టన్ ప్లాజా వాసులు, స్థానికులు శనివారం రాత్రి కొవ్వొత్తుల వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమాయక ప్రజలను పొట్టన బెట్టుకున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతులకు నివాళులర్పించారు. దేశంలో ఇలాంటి ఘటనలు మళ్లీ జరుగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కొవ్వొత్తుల వాక్‌లో రాయదుర్గం వెస్ట్రన్ ప్లాజా వాసులు, స్థానికులు



సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్‌లో..



తారానగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వ్యాపారస్తులు